# అమ్మాయి పెళ్ళి

ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళలో కుమార్ బాగా నచ్చాడు జనరల్ మేనేజర్ కృష్ణమూర్తికి. కుమార్‌కి ఉద్యోగానిక్కావల్సిన అన్ని అర్హతలూ వున్నాయి. హైలీ క్వాలిఫైడ్, స్మార్టుగా వున్నాడు. పైగా తన కులం కూడా. వెంటనే ఉద్యోగం ఇచ్చేశాడు.

తన కూతుర్ని కుమార్ కిచ్చి పెళ్ళి చేయాలని కృష్ణమూర్తి ఉద్దేశం. ఆ ఉద్దేశంతోనే తోటి మేనేజర్లకి చెప్పేరు కుమార్ తన వాడని.

పై అధికార్లకు మస్కా కొట్టి పదవులు సంపాదించే, పనిచేయటం చాతకాని మేనేజర్లు కుమార్‌ని ఆకాశానికి ఎత్తేశారు.

మూడు నెలల తరువాత ఓ రోజు కుమార్‌ని డిన్నర్‌కు ఆహ్వానించాడు కృష్ణమూర్తి. అమ్మాయికి కూడా కుమార్ నచ్చాలిగా!

భోజనం చేసేటప్పుడు చాలా చలాకీగా మాట్లాడింది కృష్ణమూర్తిగారి అమ్మాయి. కుమార్ కూడా బాగానే మాట్లాడాడు.

అమ్మాయికి కుమార్ నచ్చాడని అతనికి అర్థమైంది.

“హౌ ఈజ్ మై గర్ల్ మిస్టర్ కుమార్” అతనడిగాడు.

“వెరీ స్మార్ట్ గర్ల్.”

“చూడు కుమార్ నేను “వీకెండ్”లో గుడివాడ వెళ్ళాలనుకుంటున్నాను. మీ నాన్నగార్ని కలుసుకుంటాను.”

“మా నాన్నగారు మీకు తెలుసా అండీ.”

“ఇప్పటికి తెలియదుగానీ పరిచయం చేసుకుంటాను. కాబోయే వియ్యంకుడు కదా? నీ పెళ్ళి గురించి మాట్లాడి వస్తాను.”

గోడ మీద గడియారం సెకండ్సు ముల్లు ఒక్కసారి ఆగి కదిలింది.

“నా పెళ్ళి-అయితే మీరు గుడివాడ వెళ్ళకండి సార్. తణుకు వెళ్ళండి. మా ఆవిడ పురిటి కెళ్ళింది. తణుకు వెళ్ళి ఆవిడతో మాట్లాడి వస్తే...”

గదంతా చీకటైనట్లు అనిపించింది కృష్ణమూర్తికి. మరునాడు ఆఫీసుకు వెళ్ళగానే ప్రతి దరఖాస్తు పత్రంలోనూ “సింగిల్/మేరీడ్” కాలం వుండాలని ఉత్తర్వు జారీ చేశాడు కృష్ణమూర్తి.

- ఎల్.ఆర్. స్వామి




ఓ పత్రికలో ప్రకటన—
“గులాబీ రంగు కోటు ఆడవాళ్ళది పోగొట్టుకున్నాను. దానిమీద అయిదు వెండి గుండీలున్నాయి. ఆ కోటు ఏ మహాశయునికైనా దొరికితే ఈ అడ్రసుకు వ్రాయండి. అన్నట్టు, ఆ కోటులో ఒక స్త్రీ వుంది. ఆమె నా భార్య.”

# కామేశం కంగారు

ఎప్పటిలాగే కామేశం సాయంత్రం 6 గంటలకల్లా ఊరు చివర వంతెన మీదకు వెళ్ళి కూర్చున్నాడు. ఇలా రోజూ ప్రశాంతంగా ఒక గంటసేపు కూర్చుని రావటం కామేశానికి అలవాటే. శూన్యంలోకి చూస్తూ ఏవో ఆలోచనలలో మునిగిపోయాడు. అలా ఎంత సేపు కూర్చున్నాడో తెలియదు గాని, అప్పటికే చీకటి బాగా అలముకుంది. ఉన్నట్టుండి అందరూ తన వంక భయం భయంగా చూస్తూ యెడంగా వెళ్ళటం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలాగే ఆ దారిన వెళ్ళే వాళ్ళంతా కామేశాన్ని చూసి భయం భయంగా ప్రక్కకు తప్పుకొని వెళ్ళి పోతున్నారు. కామేశం ఊహించాడు వాళ్ళంతా తనను చీకట్లో చూసి ఏ దొంగనో లేక దయ్యాన్నో భయపడుతున్నారని గ్రహించి, గుడ్లురిమి చూస్తూ ఇంకా పెద్ద పోజు పెట్టసాగాడు. ఇంతలో అటుగా ఒక రైతు గడ్డి మోపు తల మీద పెట్టుకుని కామేశం దగ్గర దాకా వచ్చి ఆగిపోయి ఆ వంతెన మీద అటు యెడంగా అడుగులో అడుగు వేసుకుంటూ నడవసాగాడు. కామేశానికి పొట్ట చెక్కలయ్యేంత నవ్వు వచ్చింది. వీళ్ళంతా పిరికి పందలు. నన్ను చూసి భయపడుతున్నారని ముసి ముసి నవ్వులు నవ్వుకోసాగాడు. ఈ గడ్డి మోపు మనిషి వంతెన అటు ప్రక్కకు వెళ్ళి కామేశం వంక చూస్తూ 'ఏమయ్యో' అలా కూకున్నావేంటి నీ కాలు క్రింద గోధుమ త్రాచు నిలబడి వుంటే!” అని కేక వేసేటప్పటికి కాలి క్రింద పడగ విప్పి నిలబడి వున్న పామును చూడగానే కామేశానికి పై ప్రాణాలు పైనే పోయాయి. ఒక్క గంతులో వంతెన దగ్గర నుంచి ఉరికి ఊళ్ళోకి పారిపోయాడు. అప్పుడు గ్రహించాడు వాళ్ళంతా తన వంక ఎందుకు భయపడుతూ వెళ్ళారో.

– మాచవరపు శ్రీనివాసరావు

## కథ

రైలు వేగం పుంజుకుంటుంది అప్పుడే... ఎక్కవలసిన రైలు జీవితకాలం లేటు అన్న వాక్కును తారుమారు చేస్తూ ఆ వేగంలో కూడా ప్లాట్‌ఫారంమీద పరుగులు తీస్తూ రైలు ఎక్కే ప్రయత్నంలో వున్నారు కొందరు.

ఎంత పిండికి అంత రొట్టె అన్నట్టు అతని ఓపిక ఆ పరుగులోనే కరిగిపోయింది. ఇక ఏ మాత్రం ఆలస్యం చేసినా ఎక్కవలసిన రైలు వెళ్ళిపోయేలా వుంది.

అతని పాదం రైలు పెట్టెలో పెట్టడం, రైలు స్టేషన్‌ను విడిచిపెట్టడం ఏకకాలంలో జరిగిపోయాయి.

“హమ్మయ్య” అన్న ఓ నిట్టూర్పు అతని శ్వాసతో వంత పలికింది. తలుపు దగ్గరే నుంచుని వున్నామె కొంచెం తప్పుకుని అతని కాలు మోపడానికి చోటిచ్చింది.

కృతజ్ఞతా భావాన్ని ముఖంలోనే వ్యక్తంచేశాడు అతను.

“కుల మత భేదాలు, భాషా ద్వేషాలు” లేనిది నాకే కదా అన్న గర్వాన్ని ప్రకటిస్తూ పరిసరాల్ని చరచరా దాటేస్తుంది రైలు.

“ఏం నాయనా ఇది లేడీస్ కంపార్ట్‌మెంట్ అని తెలీదా?” ఓ మామ్మగారి మర్యాద ప్రశ్న.

అది లేడీస్ కంపార్ట్‌మెంటే సందేహం లేదు - అతనొక్కడే మగవాడు ఆ కంపార్ట్‌మెంట్ మొత్తానికి.

“హమ్మయ్య” మంచితేరుకోకుండానే “అయ్యబాబోయ్” అనుకున్నాడు మనసులో.

ఇప్పుడేం చెయ్యాలి? దిగడానికి అవకాశం లేదు. వుండడానికి అవమానం! ఎలా?

“ఏమండి ఇది లేడీస్ కంపార్ట్‌మెంట్ అని రాసి వుందికదా— ఎలా ఎక్కారు?” ఓ ఇల్లాలి ప్రశ్న.

కొంచెం అటూ ఇటూగా దాదాపు అందరూ అదే ప్రశ్న వేశారు.

అతని పరిస్థితి మరింత అయోమయంగా తయారయింది.

చెమటలు పడుతున్నాయి. ఏమీ చేయలేని పరిస్థితి.

“పోయినేడు నేనూ, మా అమ్మాయి ఇలాగే. రైల్లో వెడుతున్నాం.

“రైలు బయలుదేరే సమయంలో ఒకడు మా పెట్టెలో ఎక్కాడు. సర్లే అనుకున్నాం. తీరా చూస్తిం కదా కాసేపటికి కత్తి చూపించి మా నగా




న(టా అంతా దోచుకుని చైను లాగి రైలు ఆపి మరీ పారిపోయాడు'' ఓ వృద్ధ నారి తన గతానుభవం చెప్పుకుపోతుంది ఎదురుగా కుర్చున్న మధ్య వయసామెకి.

ఆత్మాభిమానం పెల్లుబికింది అతనిలో.

కానీ ఏం చెయ్యగలడు. నిస్సహాయ పరిస్థితి.

అలా వాళ్ళ సంభాషణలు రకరకాలుగా సాగిపోతున్నాయి.

''చూడండీ... మీ అందరికీ తండ్రులు, భర్తలు, కొడుకులు లేరా. మీకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు రావా? ఎప్పుడో ఎవరో, ఎక్కడో చేశాడని ఇప్పుడాయన్ని ఆడిపోసుకుంటారెందుకు? మీ దృష్టిలో లోకంలో మగవాళ్ళంతా అలాంటి వారేనా? అందుకే మన దేశం ఇంత వెనుకబడి వుంది. సమానత్వం, సమానత్వం అంటూ — విద్యలోను, ఉద్యోగాలలోను, రాజకీయాలలోను ఘనత, సమానత సాధిస్తున్నారే ఈ విషయంలో అక్కర్లేదా సమానత? చెప్పండి? ఈయన నా భర్త! నాకు ఆరోగ్యం బాగోలేదు. ముందు నేను ఈ కంపార్ట్మెంట్‌లో ఎక్కాను. ఆయన పక్క కంపార్ట్మెంట్‌లో ఎక్కారు. నన్ను ఒంటరిగా వుంచడం ఇష్టంలేక ఆ పెట్టెలోకి రమ్మని వచ్చారు. ఇంతలో రైలు కదిలింది. నేను దిగి ఆ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళే టైం లేక నేనే ఆయన్ని ఈ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చేయమన్నాను...'' అంటూ తలుపు దగ్గరున్న ఆమె అతను ఎందుకు లేడీస్ కంపార్ట్ మెంట్ ఎక్కాడో పరిస్థితి వివరించింది ఆ పెట్టె లోని ఆడవాళ్ళందరికీ.

''మరి అలా చెప్పొచ్చుకదమ్మా మీ ఆయనని— మేం కాదంటామా?'' ఒకామె.

''ఏమో నమ్మా! అసలే కలికాలం! ఆయన మీ ఆయన అని మాకేం తెలుసు. అందుకే అలా అన్నాం'' మరొకామె నొచ్చుకోలు.

అతను ఆమె వంక ప్రశ్నార్థకంగా చూశాడు?!

ప్రస్తుతం ఏమీ అడగవద్దు అన్నట్టు ఆమె సైగ చేసింది. అసలామె ఎవరు? నా తరఫున వకాల్తా పుచ్చుకొని మాట్లాడిందేమిటి? మాట, కట్టు బొట్టు చూస్తే చదువుకున్నామెలా వుంది. నేను ఆమె భర్తని కాదు, కనీసం పరిచయస్తుణ్ణి కూడా కానే— అసలు నాకు పెళ్ళే కాలేదు. మరి ఎందుకు మాట్లాడింది? ఇలా చాలా సందేహాలు అతని మదిలో మెదిలాయ్.

రైలు వేగం తగ్గింది. స్టేషన్‌లో ఆగింది.

తేనెటీగలు ఎగిరినట్టుగా బిలబిలా జనాలు రైలు దిగారు. అతనూ దిగాడు, అతని వెంట ఆమె దిగింది.

''మీరెక్కడికెళ్ళాలి?'' అడిగాడు.

''నేను ఇక్కణ్ణించి ఇంకో ట్రైన్ ఎక్కాలి'' చెప్పిందామె.

''అవునూ — మీరెవరో నాకు తెలీదు, నేనెవరో మీకు తెలీదు. నాకింకా పెళ్ళే కాలేదు. వాళ్ళతో మీరెందుకు అబద్ధం ఆడారు?'' సూటిగా అడిగాడు.

''ముందుగా — అబద్ధం ఆడినందుకు క్షమించండి''.

నాకు నా మీద ఆధారపడ్డ తల్లి తప్ప మరెవ్వరూ లేరు. బట్టల కొట్లో పనిచేసేదాన్ని. ఆ షాపు ఓనర్ కొడుకు నన్ను పాడుచేశాడు. పైగా పనిలోంచి తీసేశాడు. గత్యంతరం లేని పరిస్థితులలో వ్యభిచారాన్ని వృత్తిగా చేసుకున్నాను. నైతిక బాధ్యతలకి కట్టుబడి నైతిక విలువల్ని వదిలేసి ఈ జీవితం గడిపేస్తున్నాను.

ఈ జన్మకు నాకు పెళ్ళయ్యే రాత లేదు.

ముత్తయిదునయే అవకాశం లేదు.

ఈ పాపిష్టి జీవితంలో ఒక్క క్షణం అయినా ఒకరికి భార్యగా బ్రతకాలని అనిపిస్తుంటుంది. అది సాధ్యపడదని కూడా తెలుసు. అయినా కోరిక...

అందుకే ఇందాకటి పరిస్థితుల్లో కావాలని కల్పించుకొని మీ భార్యనని అబద్ధమాడాను.

అబద్ధం చెప్పానే అనిపించింది. అయినా ఆ క్షణంలో మీరు మౌనంగా వుండడం, ఆ ఆడవాళ్ళందరూ మన పరిస్థితికి నొచ్చుకోడం ఆ క్షణంలో నాకు తృప్తి అనిపించాయి. ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా ఆ కొన్ని క్షణాలయినా మీ భార్యగా వున్నందుకు — ఆ తాత్కాలిక తృప్తి జీవితాంతం మిగిలిపోతుందండి! నేను చేసింది తప్పే అనుకుంటే నష్టం రాకపోయినా, కష్టం కాకపోయినా మీ ఇష్టంలేకుండా అలా ప్రవర్తించినందుకు మరొకసారి క్షమించండి —'' కన్నీళ్ళు తుడుచుకుంటూ వివరించిందామె పరిస్థితి.

అతని కళ్ళు చమర్చాయ్—!! ఆమె ఎక్కవలసిన రైలు వచ్చింది.